సంపుటి :02 సంచిక :302 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

సోమవారం 09, ఫిబ్రవరి 2026

## సేవకుడిగా మీ ముందుకు...

- మాటలతో కాదు, పనితోనే నిరూపిస్తా
- ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న కౌన్సిలర్ అభ్యర్థి సునీల్

05



## 11న ఎన్నికల సెలవు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద



02

# మూటలు కట్టి.. మూటలు విప్పి!

## ముగిసిన మున్సిపల్ మైకుల జోరు..

- తెరవెనక 'నోట్ల' హోరు
- ఓటుకు రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు పంపిణీ
- చైర్మన్ రేసులో ఉన్న వార్డుల్లో ఎగిసిపడుతున్న ధర
- 12 మున్సిపాలిటీలు.. 260 వార్డులు..
- 1072 మంది అభ్యర్థులు



మున్సిపల్ ఎన్నికల వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయం పతాక స్థాయికి చేరింది. ఇన్నాళ్లూ గల్లీ గల్లీలో ఊదరగొట్టిన మైకుల మోతకు బ్రేక్ పడింది. ప్రచార పర్వం ముగియడంతో అభ్యర్థులు తమ వ్యూహాలను మార్చారు. మైకుల సాక్షిగా ఇచ్చిన హామీల పర్వం ముగియగా.. ఇప్పుడు 'మూటల' సాక్షిగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పర్వం మొదలైంది. ప్రలోభాల పర్వానికి తెరలేపి, గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు బరితెగిస్తున్నారు. మున్సిపల్ కురుక్షేత్రంలో గెలిచి తీరాలనే కసితో అగ్రనేతలు సైతం ప్రచార క్షేత్రాన్ని హోరెత్తించగా, ఇప్పుడు అభ్యర్థులు మాత్రం 'కరెన్సీ' కట్టలతో ఓటరు దేవుళ్ల ముంగిట చేరుతున్నారు.

– అక్షరదర్బార్, వరంగల్

02

## కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

- అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- భూపాలపల్లిలో బీఆర్ఎస్ రోడ్ షో

05



## స్కూల్ బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్

- ఇద్దరు మృతి, పన్నెండు మందికి గాయాలు
- మద్యం మత్తులో డ్రైవర్ నిర్వాకం.. తప్పిన పెద్ద ప్రమాదం

02




### కోటగుళ్లలో అశుతోష్ పాండే
## ప్రత్యేక పూజలు

- ఆలయ విశిష్టతను కొనియాడిన ఎస్ఈసీఎల్ డీజీఎం
- ఘనంగా సన్మానించిన అర్చకులు, ధర్మకర్తలు

03



- చివరి ప్రయత్నంగా ఓటర్లకు డబ్బు పంపిణీ చేసే పనిలో అభ్యర్థులు
- ఓటుకు రూ.2రెండు వేల వరకు మొదలైన పంపిణీ!
- అన్ రిజర్వుడ్ స్థానాల్లో ఓటుకు రూ.3 వేలకు పైగానే..
- చైర్మన్ రేసులో ఉన్న అభ్యర్థులు ఓటుకు రూ.5 వేల వరకు..
- తగ్గేదేలే అంటూ గెలుపే లక్ష్యంగా డబ్బు పంపిణీలో అభ్యర్థుల పోటీ
- రేవంత్ రెడ్డి, కేటీఆర్, అగ్రనేతల ప్రచారంతో హోరెత్తిన ఓరుగల్లు
- 12 మున్సిపాలిటీల్లోని 260 వార్డుల నుంచి బరిలో 1072 మంది అభ్యర్థులు



# మాటలు కట్టి.. మూటలు విప్పి

## ముగిసిన మున్సిపల్ మైకుల జోరు.. తెరవెనక 'నోట్ల' హోరు

**అక్షరదర్బార్, వరంగల్ :**
కొద్ది రోజుల నుంచి హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. బుధవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత మైకులన్నీ మూగబోయాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మాటలు కట్టి మూటలు విప్పారు. చివరి ప్రయత్నంగా ప్రలోభాలకు తెర తీశారు. ఓటర్లకు డబ్బు పంపిణీ చేసే పనిలో తలమునుకలయ్యారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం జనవరి 27న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే తెల్లవారి 28 నుంచి 30వ తేదీ వరకు ఎన్నికల అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు 31న నామినేషన్లను పరిశీలించారు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల మూడున్న ముగిసింది దీంతో అదే రోజు బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరనేది వార్డు వారీగా తేలిపోయింది. దీంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బరిలో నిలిచిన అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. గడపగడపకు వెళ్లి నేరుగా ఓటర్లను కలిశారు. ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ప్రచారంలో అభ్యర్థులు పోటీపడ్డారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గెలుపే లక్ష్యంగా హామీల జల్లు కురిపించారు.

### - హోరెత్తిన ప్రచారం

ఉమ్మడి వరంగల్ లో 12 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో జనగామ, స్టేషన్ గణపురం, వర్ధన్నపేట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, నర్సంపేట, ములుగు, పరకాల, భూపాలపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీల పరిధిలోని 260 వార్డుల నుంచి 2072 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కొన్ని మున్సిపాలిటీల్లోని వివిధ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా, ప్రతి మున్సిపాలిటీ పరిధిలోని మెజార్టీ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య ముఖాముఖి పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు నువ్వా నేనా అనే రీతిలో తలపడుతున్నారు. ఈసారి తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాన రాజకీయ పార్టీల అగ్ర నేతల సైతం ప్రచారం నిర్వహించారు. ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెల్పూర్ వద్ద ప్రజాపాలన– ప్రగతి బాట బహిరంగ సభలో పాల్గొని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మహబూబాబాద్, నర్సంపేట, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల మున్సిపాలిటీల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఆయా మున్సిపాలిటీలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్య నేతలు సైతం ప్రచారంలో పాల్గొన్నారు. చివరి రోజు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు, అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు.

### - ఇక డబ్బు పంపిణీ..

ప్రచారం ముగిసిపోవడంతో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చివరి ప్రయత్నంగా ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడంలో మునిగిపోయారు. ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీల పరిధిలోని వివిధ వార్డుల్లో బరిలో ఉన్న అభ్యర్థులు కొందరు ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడం మొదలుపెట్టినట్లు తెలిసింది. ఒక్కో ఓటుకు రూ.2 వేలకు తగ్గకుండా డబ్బు పంపిణీ చేసే పనిలో అభ్యర్థులు ఉన్నట్లు సమాచారం. ఇక అన్ రిజర్వుడు (జనరల్) స్థానాల్లో ఒక్కో ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు డబ్బు పంపిణీ చేసే పనిలో అభ్యర్థులు, పార్టీలు ఉన్నట్లు తెలిసింది. ఇక మున్సిపాలిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న అభ్యర్థుల వార్డుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. ఎలాగైనా చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న అభ్యర్థులు తమ వార్డులో గెలిచేందుకు ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడంలో పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఎందుకంటే కౌన్సిలర్ గా గెలిస్తేనే చైర్మన్ పదవి రేసులో దిగే పరిస్థితి. దీంతో చైర్మన్ పదవి ఆశిస్తున్న అభ్యర్థుల వార్డుల్లో డబ్బు పంపిణీ ఓటుకు రూ.5వేల వరకు జరిగే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మొత్తంగా అభ్యర్థులు, పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నిమగ్నమైనట్లు సమాచారం.

# ఈనెల 11న ఎన్నికల సెలవు

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుటకు ఈనెల 11న జరిగే పోలింగ్ రోజున స్థానిక సెలవుగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం కలెక్టర్ కు కల్పించబడిన అధికారాల మేరకు వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపాలిటిలో పోలింగ్ జరిగే ఈ నెల 11న ప్రభుత్వ, సంస్థల ఉద్యోగులకు, సాధారణ సెలవు, ఎన్నికల ప్రాంతంలో ఉన్న షాపులు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పిస్తున్నట్లు తెలిపారు.
ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు.

# స్కూల్ బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్

- ఇద్దరు మృతి, పన్నెండు మందికి గాయాలు
- మద్యం మత్తులో డ్రైవర్ నిర్వాకం..

అక్షరదర్బార్, సంగెం : సంగెం మండలం తీగరాజుపల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్, స్కూల్ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఒక చిన్నారి మృతి చెందగా, మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూల్ బస్సులో ఉన్న 40 మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

### - అతివేగమే ప్రమాదానికి కారణం

స్థానికుల కథనం ప్రకారం.. అన్నారం షరీఫ్ దర్గాలో కందూరు వేడుక ముగించుకుని 12 మంది ప్రయాణికులతో ట్రాక్టర్ వరంగల్ వైపు వస్తోంది. ఈ క్రమంలో తీగరాజుపల్లికి చెందిన నోటరీడం స్కూల్ బస్సు ఎదురుగా వచ్చింది. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో పాటు అతివేగంగా నడపడం వల్ల నియంత్రణ కోల్పోయి బస్సును ఢీకొట్టాడు. ఢీకొన్న వేగానికి ట్రాక్టర్ డబ్బా పల్టీ కొట్టి ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు.

### - చికిత్స పొందుతూ మృతి




ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్, ఒక చిన్నారి మరణించారు. గాయపడిన 12 మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### - తప్పిన పెను ప్రమాదం

ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో సుమారు 40 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు డ్రైవర్ అప్రమత్తతతో వ్యవహరించడం, ట్రాక్టర్ సైడ్ నుంచి తగలడంతో పిల్లలకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. పిల్లలకు స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు

అక్షరదర్బార్, హనుమకొండ: మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 11వ తేది బుధవారం జనగామ, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధమని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ నిషేధం రేపు 10వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 11వ తేదీ రాత్రి 8 గంటల వరకు అమలులో ఉంటుందని, ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ములుగు జిల్లా రద్దు ప్రచారం అబద్ధం : మంత్రి సీతక్క

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లాను రద్దు చేస్తారంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ములుగు జిల్లా సాధన ఉద్యమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు ఇచ్చారని, జిల్లాల సరిహద్దుల సవరణల గురించే సీఎం మాట్లాడితే అర్థం చేసుకోలేక బీఆర్ఎస్ నేతలు పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని అన్నారు. ములుగు జిల్లాలో ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ములుగు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి సీతక్క ప్రజలను కోరారు.



## ఆల్ ఇండియన్ కరాటే పోటీల్లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

అక్షర దర్బార్, నర్సంపేట : ఆల్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో నర్సంపేట పట్టణ నికి చెందిన గీతాంజలి స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి బహుమతులు సాధించారు. విజేత లను నర్సంపేట కరాటే మాస్టర్, టోర్నీ ఇన్చార్జ్ రచ్చ శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారా వు, ప్రిన్సిపాల్ ఎన్ రాజేష్ బహుమతులు సాధిం చిన పి.సమన్విత, పి.సాత్విక్ ను అభినందించారు.

# భక్తులకు ఇబ్బందులు రావొద్దు

### మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సీతక్క



అక్షర దర్బార్ వెంకటాపూర్ : వెంకటాపూర్ మండ లంలోని పాలంపేట గ్రామంలో గల సుప్రసిద్ధ రామప్ప దేవాలయంలో రామలింగేశ్వర స్వామి సన్నిధిలో జరిగే మహాశివరాత్రి వేడుకల వాల్ పోస్టర్ లను మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశివ రాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు తగు జాగ్రత్తలు వహించా లని పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు రూపొందించాలని అధికారు లకు సూచించారు. ప్రజలందరూ స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బిల్లా శ్రీనివాస్ ఆలయ ముఖ్య అర్చకులు కోమల్లపల్లి హరీష్ శర్మ మరియు తదితరులు పాల్గొన్నారు.



## కోటగుళ్లలో అశుతోష్ పూజలు

అక్షరదర్బార్, గణపురం: ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో సౌత్ ఈస్టన్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ బిలాస్పూర్ ఛత్తీస్గఢ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అశుతోష్ పాండే స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటగుళ్ళ ఆలయ ధర్మకర్త అట్లూరి వెంకట లక్ష్మి నరసింహారావు తో కలిసి కోటగుళ్లను సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గణపతి, నందీశ్వరుడు గణపేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగరాజు వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచ నాలు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి యాదగిరి గౌడ్ అశుతోష్ పాండే కు వివ రించారు. ఆలయ శిల్ప సంపదను ఆయన తన కెమెరాల్లో చిత్రీకరిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## గెలిపించండి.. సేవ చేస్తా..

### 20వ వార్డు బిజెపి అభ్యర్థి పాలకుర్తి తిరుపతి..



అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు బిజెపి అభ్యర్థి పాలకుర్తి తిరుపతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిజెపి అభ్యర్థులను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని, బిజెపిని గెలిపిస్తే వార్డును మోడల్ వార్డులుగా తీర్చిదిద్దామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. వార్డ్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, సేవకుడిగా పనిచేస్తానని, వార్డులోని ప్రతి సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది మూడోవిడత ర్యాండమైజేషన్ పూర్తి



అక్షరదర్బార్, పరకాల: పరకాల పుర పాలక ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ను సోమవారం హను మకొండ జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పూర్తి చేశారు.జిల్లా ఎన్నికల పరిశీలకులు కె. శివకుమార్ నాయుడు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది. ఈ నెల 11న జరగ నున్న ఎన్నికల దృష్ట్యా 22 వార్డులకు సంబంధించిన పోలింగ్, అదనపు పోలింగ్ అధికారులు, ఓపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిం చారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి సుష్మతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే నర్సంపేట అభివృద్ధి

### జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



అక్షర దర్బార్ నర్సంపేట : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని రాష్ట్రంలోని నర్సంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతానని వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి అన్నారు సోమవారం నర్సంపేట పట్టణంలోని పురవీధుల్లో మున్సిపాలిటీ బిజెపి అభ్యర్థుల విజయానికి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను ఓట్ల అభ్యర్థించారు ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో బిజెపి పాత్ర ఎంతో ఉందని రానున్న ఎన్నికల్లో కాషాయం జెండాను ఎగరేస్తేనే నర్సంపేట అభివృద్ధి సాధ్యమన్నారు.. కాంగ్రెస్ టిఆర్ఎస్ నాయకుల ఆగడాలని అరికట్టాలంటే నర్సంపేటలో బిజెపిని గెలిపించాలని కోర్డులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గం బిజెపి నాయకులు నర్సంపేట మున్సిపాలిటీ బిజెపి పోటీ చేసే అభ్యర్థులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో బాలాజీ విద్యార్థుల ప్రతిభ

అక్షర దర్బార్, నర్సంపేట: ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన అబాకస్ పోటీల్లో నర్సంపేట పట్టణానికి చెందిన బాలాజీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి బహుమతులు సాధించారు. హైదరాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ సీనియర్ లెవెల్ పోటీ పరీక్షల్లో బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థి బి. యశ్వంత్ కుమార్ మొదటి స్థానం సీనియర్ లెవెల్ -3 రైజింగ్ స్టార్ విన్నర్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ విద్యార్థి కె .లిఖిత శ్రీ మొదటి స్థానం జూనియర్ స్టార్ లెవెల్-3 విభాగంలో జీనియస్ విన్నర్ గా, కె. సాకేత్ చౌహాన్ జూనియర్ లెవెన్ -3 విజువలైజేషన్ విభాగంలో మొదటి స్థానం, అక్షర ది స్కూల్ విద్యార్థి ఎస్. కౌశిక్ రెడ్డి మొదటి స్థానం స్టార్ జూనియర్ లెవెల్ -3 విభాగంలో రైజింగ్ స్టార్ విన్నర్ గా సర్టిఫికెట్లు ,షీల్డ్ లు సాధించారు. విజేతలను బాలా జీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రా జేంద్రప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ వనజ అభినందించారు. కార్యక్రమంలో సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పి రాజేంద్రప్రసాద్ రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. జ్యోతి, అక్షర ది స్కూల్ ప్రిన్సిపాల్ భవాని, సిఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారంపై నిషేధం

### మద్యం, కల్లు దుకాణాలు మూసివేత

అక్షర దర్బార్, పరకాల: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ను పురస్కరించుకుని పరకాల మున్సిపల్ పరిధిలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని వరంగల్, హన్మకొండ జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు స్నేహ శబరిష్, సత్యశారద తెలిపారు. ఎన్నికలు ముగిసేంత వరకు 48 గంటల సైలెన్స్ పీరియ డ్ నిబంధనలు కఠినంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ బృందాలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. అలాగే ఓట్ల లెక్కింపు సందర్భం గా ఈ నెల 13న కూడా డ్రై డే అమలు చేస్తామని, కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు మద్యం, కల్లు దుకాణాలు మూసివేత కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం..

### ఎమ్మెల్యే రేవూరి ఇంటింటి ప్రచారం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్రెడ్డి సోమవారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.మోసపూరిత బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మవద్దని సూచిస్తూ, గత పాలకుల కారణంగా పట్టణం వెనుకబడిందన్నారు. కాంగ్రెస్ పాలనతోనే పరకాల అభివృద్ధి సాధ్యమని, సీసీ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు తదితర వసతులతో మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత విద్యుత్, రేషన్, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.





# నర్సంపేటను దొంగల చేతిలో పెట్టొద్దు

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

## బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటి ప్రచారం

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీని దొంగల చేతిలో పెట్టి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అభ్యర్థుల గెలుపు కోసం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుంటూ, కాంగ్రెస్ పాలనలో జరిగిన పరిస్థితులను పరిశీలించి బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. అధికారం అడ్డుపెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై ఆరోపించారు. నర్సంపేట ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



# వెంకటేశ్వర్లపల్లిలో గ్రామసభ

## శివాలయ నిర్మాణానికి తీర్మానం

అక్షర దర్బార్, కమలాపురం: కమలాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ఇప్పటివరకు శివాలయం లేనందున శివాలయ నిర్మాణానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖకు ప్రతిపాదనలు పంపాలని గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో ఉన్న 150 మంది కళాకారులతో ప్రత్యేకంగా కళాకారుల సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇదే సమయంలో గ్రామంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులు కమలాపూర్ మండల పరిషత్ పరిధిలో జరగాల్సి ఉండగా, నడికూడ మండలం నుంచి ఎందుకు నిర్వహిస్తున్నారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై గ్రామసభలో వాడివేడి చర్చ జరిగింది.







# కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

- ఆరు గ్యారెంటీలు అమలు శూన్యం
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్షర దర్బార్, పరకాల: కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డిని నమ్మిన ప్రజలు నష్టపోయారని, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆరు గ్యారెంటీలకు బాండ్ పేపర్ రాసిచ్చి కూడా వాటిని అమలు చేయలేకపోయారని ఆరోపించారు. సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచార రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పాలనలో పూర్తిగా కుంటుపడిందన్నారు. పరకాలను అభివృద్ధి చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొంటూ, మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, గండ్ర రమణారెడ్డి, నన్నపనేని నరేందర్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైస్కూల్ ను సందర్శించిన జిల్లా ప్యానల్ టీం బృందం

అక్షర దర్బార్ వెంకటాపూర్ : వెంకటాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ములుగు జిల్లా ప్యానల్ టీం సభ్యుల బృందం సందర్శించి పాఠశాల సమగ్ర ప్రగతిని పరిశీలించారు. విద్యా ప్రగతికి సంబంధించిన విషయాలతో పాటు పాఠశాల మౌలిక వసతులపై కూడా ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతం, గ్రేడుల వివరాలు పరిశీలించిన పిమ్మట మౌలిక వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆర్ ఓ ప్లాంట్ ద్వారా మంచినీటి లభ్యత, మరుగుదొడ్ల సక్రమ నిర్వహణ, రుచికరమైన మధ్యాహ్న భోజనం తదితర విషయాల్లో పాఠశాల సక్రమ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ బృందంలో జనగాం. బాబురావు, హాజి, శ్రీనివాస్, దేహమూద్, హమీద్, నాగేశ్వర్ రావు ఉదయం ప్రార్ధన సమయం నుండి సాయంత్రం పాఠశాల ముగిసే వరకు పాఠ్యంశాలతో పాటు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.



# 21వ వార్డులో బీజేపీ విస్తృత ప్రచారం

## గిరి ప్రసాద్ ను భారీ మెజార్టీతో గెలిపించండి

## డా. సంతోష్ ప్రచారానికి ఓటర్ల బ్రహ్మరథం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పరకాల బీజేపీ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణంలోని 21వ వార్డులో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ హాజరయ్యారు. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పరకాల అభివృద్ధి కోసం కృషి చేసే వారికి కాకుండా డబ్బున్న



వారికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు టికెట్లు ఇచ్చాయని విమర్శించారు. ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బును తిరిగి సంపాదించేందుకే వారు ప్రయత్నిస్తారని, అలాంటి వారికి ఓటు వేయవద్దని ఓటర్లను కోరారు. బీజేపీ అభ్యర్థులు అవినీతి లేకుండా అభివృద్ధినే లక్ష్యంగా పని చేస్తారని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే బీజేపీ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. 21వ వార్డులో బీజేపీ అభ్యర్థి బండారి గిరి ప్రసాద్ యువ నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాల కోసం నిలబడ్డాడని అన్నారు. పరకాల పట్టణ వ్యాపారాలు అభివృద్ధి చెందాలంటే ఇలాంటి యువ నాయకులను గెలిపించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ చేసిన ప్రచారానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మరథం పట్టారు. బీజేపీ పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న నాయకుల కృషిని పార్టీ నేతలు అభినందించారు. ఈ ప్రచారంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ లో చేరిన సీనియర్ జర్నలిస్ట్ సతీష్ యాదవ్

అక్షరం దర్బార్, వెంకటాపూర్ : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేధావులు బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి బలమన్నారు. గత 15 ఏళ్లుగా మీడియా రంగంలో ప్రజా సమస్యలపై పనిచేసిన సతీష్ పార్టీలో చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్క రమేష్, పోరిక గోవింద్ నాయక్, సకినాల భవాని,భూక్య జంపన్న, ములుగు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము రమేష్ రెడ్డి, వేముల



బిక్షపతి,ములుగు పట్టణ అధ్యక్షులు చెన్న విజయ్, నర్సాపూర్ సర్పంచ్ గై రుద్రమదేవి, సీనియర్ నాయకులు బిక్షపతి,లింగాల రమణారెడ్డి, పోశాల వీరమల్లు, చింతి రెడ్డి ప్రసాద్ రెడ్డి, చింతి రెడ్డి అనోజ్ రెడ్డి, చింతి రెడ్డి రవీందర్ రెడ్డి, వీరబోయిన సాంబయ్య యాదవ్, సోమిరెడ్డి రవి, బోయిని చిన్న రవి, మెరుగు సతీష్, భాష వేణి అశోక్ యాదవ్, బోయిన సాదయ్య, కొలనుపాక రవీందర్, గువ్వ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లోకి 10వ వార్డు అభ్యర్థి

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ధర్మసమాజ్ పార్టీ 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం ఝాన్సీ సుమన్ తోపాటు పలువురు నాయకులు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా



కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. పరకాల పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని,మున్సిపాలిటీ ఎన్నికల్లో పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

# ముగిసిన ప్రచారం



- మూగబోయిన మైకులు, నిశ్శబ్ధంగా మారిన పురవీధులు
- ఎల్లుండి ఉదయం 7 నుంచి 5 గంటల వరకు పోలింగ్
- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు
- బరిలో 12,930 మంది అభ్యర్థులు.. 52.50 లక్షల మంది ఓటర్ల తీర్పు
- 13న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాల వెల్లడి
- 16న చైర్మన్ వైస్ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక
- ప్రచారాన్ని హోరెత్తించిన ప్రధాన పార్టీల అగ్రనేతలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో గత కొద్దిరోజులుగా హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసింది. మైకులు మూగబోవడంతో పట్టణాలు నిశ్శబ్దంగా మారాయి. అభ్యర్థులు చివరి నిమిషం వరకు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఇక ఎల్లుండి బుధవారం ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఈ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,982 వార్డులకు పోలింగ్ జరగనుంది. గత జనవరి 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా 28 నుంచి 30వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించిన విషయం తెలిసిందే.

## - బరిలో 12,930 మంది అభ్యర్థులు

బరిలో మొత్తం 12,930 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 52.50 లక్షల మంది ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. 11న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఓటు వేయడానికి వెళ్లే వారు తప్పనిసరిగా ఓటర్ ఐడి లేదా ప్రభుత్వం గుర్తించిన ఇతర గుర్తింపు కార్డులను వెంట తీసుకెళ్లాలి. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ప్రచారం ముగిసిన సమయం నుండి పోలింగ్ ముగిసే వరకు ఎటువంటి బహిరంగ సభలు, ర్యాలీలకు అనుమతి ఉండదు.

## - కౌంటింగ్ ఎప్పుడంటే?

పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్లకు తరలిస్తారు. ఫిబ్రవరి 13న శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈనెల 16న మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ల, కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్ ల ఎన్నికల జరగనుంది.

## - అగ్ర నేతల ప్రచారం

మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రధాన రాజకీయ పార్టీల అగ్ర నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని తమ పార్టీ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కూడా ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 4 నుంచి రాష్ట్రంలో పర్యటించారు. మిర్యాలగూడ, చొప్పదండి, నిజామాబాద్, భూపాలపల్లి, వికారాబాద్ బహిరంగ సభల్లో మాట్లాడి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కు కాలం చెల్లింది

- అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- భూపాలపల్లిలో బీఆర్ఎస్ రోడ్ షో

అక్షరదర్బార్, భూపాలపల్లి: మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం భూపాలపల్లిలో నిర్వహించిన రోడ్ షో హోరెత్తింది. పట్టణ పురవీధుల్లో నిర్వహించిన ఈ ర్యాలీకి జనం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భూపాలపల్లి రూపురేఖలు మార్చామని, ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు.

## - గులాబీ జెండాయే శ్రీరామరక్ష

తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, స్థానిక సంస్థల్లో గులాబీ జెండా ఎగిరితేనే వార్డుల అభివృద్ధి సాధ్యమవుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలపై జరుగుతున్న దాడులను సహించబోమని హెచ్చరించారు. కేటీఆర్ పర్యటనతో భూపాలపల్లి పట్టణం గులాబీమయంగా మారింది. మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు.

# నర్సంపేటలో అభివృద్ధి కనిపించడం లేదా?

- పదేళ్లలో దోచుకున్న బీఆర్ఎస్ నేతలకు ప్రశ్నించే అర్హత లేదు
- రోడ్ షో లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట:నర్సంపేట పట్టణంలో ప్రతి గల్లీలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. సోమవారం మునిసిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజున వరంగల్ చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.140 కోట్లతో నర్సంపేటలో అభివృద్ధి పనులు చేపట్టామని, అన్ని వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క డబుల్ బెడ్ ఇల్లు కూడా నిర్మించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 1100 ఇండ్లు, 1500 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని చెప్పారు. నర్సంపేట మునిసిపల్ లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు. ఈ రోడ్ షోలో నర్సంపేట నియోజకవర్గం నర్సంపేట పట్టణ విలీన గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





# సేవకుడిగా.. మీ ముందుకు..

- మాటలతో కాదు, పనితోనే నిరూపిస్తా
- ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న కౌన్సిలర్ అభ్యర్థి సునీల్

అక్షరదర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పావుశెట్టి సునీల్ ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. నాయకుడిగా కాదు... సేవకుడిగా మీ ముందుకు వస్తున్నా అని చెబుతున్న సునీల్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

## - గత అనుభవమే ఆయన బలం

పరకాల పట్టణానికి చెందిన పావుశెట్టి సునీల్ గతంలో వార్డు సభ్యుడిగా గెలుపొంది అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిన ఘనత కలిగిన నాయకుడు. అప్పటి నుంచే ప్రజల గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. మాటలతో కాలయాపన కాదు... పనితోనే నిరూపించే నాయకుడుగా సునీల్‌కు మంచి పేరు ఉందని వార్డు ప్రజలు చెబుతున్నారు.

## - 'సునీల్' అంటేనే ఒక బ్రాండ్

కష్టాల కడలి నుంచి కష్టపడి ఎదిగిన నాయకుడిగా పావుశెట్టి సునీల్ పేరు పరకాల పట్టణమంతా పరిచయమే. పనిని నమ్ముకున్న నాయకుడు, ప్రజల నుంచి వచ్చిన నాయకుడు ఆయన. మాట ఇస్తే మడమ తిప్పడు అనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. అందుకే పార్టీలకతీతంగా పట్టణ ప్రజలంతా సునీల్ గెలుపు కోసం ఎదురుచూస్తున్నారు.

## - లోకల్ నాయకుడిగా..

పరకాలలో పుట్టి పెరిగి, పట్టణ సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన నాయకుడిగా సునీల్ ప్రజల ముందుకు వస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో పరకాలకే చెందిన నాయకులు పట్టణ అభివృద్ధికి కృషి చేసినట్లే, ఆ కోవకు చెందిన సునీల్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రజలపై ఉందని వారు అంటున్నారు.

## - ఏడవ వార్డు అభివృద్ధికి హామీ

ఏడవ వార్డులో డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల లేమి, కొందరికి పెన్షన్లు అందకపోవడం వంటి సమస్యలను ప్రత్యక్షంగా చూశానని సునీల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లతో కాలనీని స్మార్ట్ కాలనీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ముదిరాజుల కాలనీతో పాటు మిగతా కాలనీల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తానని స్పష్టం చేశారు.

## - ప్రజలు ఆశీర్వదిస్తే అభివృద్ధి మనదే

ఏడవ వార్డు ప్రజలు నన్ను నమ్మి ఆశీర్వదిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని పావుశెట్టి సునీల్ కోరారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశయాలు నెరవేరాలంటే పరకాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915